సాక్షి
మహబూబ్‌నగర్

మంగళవారం। 18। ఫిబ్రవరి। 2025



ఎట్టకేలకు దొరికాడు
నకిలీ సర్టిఫికెట్‌తో ఉద్యోగం పొందిన వ్యక్తిని పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు.

వివరాలు 8లో ▸



రిటైర్డ్ ఉద్యోగుల తొలగింపు
పీయూలో తాత్కాలిక పద్ధతిలో పని చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులను తొలగించారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.6 /14.0

వాతావరణం
ఉదయం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

21న 'పేట'కు సీఎం రాక



నారాయణపేట: ఈ నెల 21న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నారాయణపేటకు రానున్నారని కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె హెలీప్యాడ్ స్థలాన్ని ఎస్పీ యోగేష్ గౌతమ్‌తో కలిసి పరిశీలించారు. అలాగే ఫొటో ఎగ్జిబిషన్, స్టేజీ తదితర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ముఖ్యమంత్రి పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. సీఎం పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు.

తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్ల బదిలీలు
జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రెవెన్యూ శాఖలో తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్ల బదిలీ చేస్తూ సోమవారం కలెక్టర్ విజయేందిర ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో జడ్చర్ల తహసీల్దార్ బ్రహ్మంగౌడ్ సీసీఎల్‌కు, మక్తల్ తహసీల్దార్ నర్సింగ్‌రావు జడ్చర్లకు, సీసీఎల్ నుంచి శేఖర్ అడ్డాకులకు, కలెక్టరేట్ ఈ–సెక్షన్ నుంచి మదన్‌మోహన్ అడ్డాకులకు బదిలీ అయ్యారు. అలాగే జడ్చర్ల నాయబ్ తహసీల్దార్ రాజీవ్‌రెడ్డి సివిల్ సప్లయ్‌కి, నవాబ్‌పేట నుంచి గాయత్రి సివిల్ సప్లయ్‌కి, కలెక్టరేట్ నుంచి శ్యాంసుందర్‌రెడ్డి మహబూబ్‌నగర్ రూరల్, మహబూబ్‌నగర్ రూరల్ నుంచి సువర్ణ నవాబ్‌పేటకు, సివిల్ సప్లయ్ నుంచి జడ్చర్లకు కిషోర్ బదిలీ అయ్యారు. అయితే ప్రస్తుతం జరిగిన బదిలీల్లో ఉద్యోగ సంఘాల నాయకులు చక్రం తిప్పినట్లు తెలుస్తోంది.

ఇన్‌చార్జ్ ఎంఈగా సందీప్
మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఎంఈ (ఎఫ్‌ఏసీ)గా ఇక్కడే పనిచేస్తున్న డీఈఈ కె.సందీప్ బాధ్యతలు అప్పగిస్తూ తాజాగా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కాగా మున్సిపల్ ఇంజినీర్ (ఎంఈ)గా వ్యవహరిస్తున్న బస్వరాజ్ వ్యక్తిగత కారణాలతో ఈ నెల 7 నుంచి వచ్చే 31 వరకు సెలవులో వెళ్లారు.

అలరించిన పౌరాణిక పద్యనాటక ప్రదర్శనలు



స్టేషన్ మహబూబ్‌నగర్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీమిత్ర కళానాట్య మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పౌరాణిక పద్యనాటక ప్రదర్శనలు అలరిస్తున్నాయి. ఈ క్రమంలో సోమవారం మూడోరోజు శారద కళా పరిషత్ (మహబూబ్‌నగర్) ఆధ్వర్యంలో మయసభ దుర్యోధన, మైత్రి కళా సమితి (నంచర్ల), శివాంజనేయ నాట్య కళా మండలి (చిన్నరాజమూర్) సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకృష్ణాంజనేయ యుద్ధంలోని శ్రీకృష్ణ, కుచేల ఘట్టం, జ్ఞానమృత కళామండలి (కోయిలకొండ) ఆధ్వర్యంలో గయోపాఖ్యాన యుద్ధ ఘట్టం, గరుత్మంత నారద సంవాదం నాటకాలను ప్రదర్శించారు. కళాకారులు తమ అభినయంతో అలరించారు. గాయకులు చెన్నకేశవులు భక్తిపాటలు పాడి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా శ్రీమిత్ర కళా నాట్యమండలి ప్రధాన కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ పదేళ్ల నుంచి తమ సంస్థ ఆధ్వర్యంలో మన్యంకొండ క్షేత్రంలో పౌరాణిక పద్య నాటకాలు ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. మంగళవారం చివరి రోజు పద్యనాటక ప్రదర్శనల్లో భాగంగా రాజరాజేశ్వరి భజన మండలి (మహబూబ్‌నగర్), శ్రీరామాంజనేయ భజన మండలి (బొక్కలోనిపల్లి) ఆధ్వర్యంలో భజనలు నిర్వహిస్తారని, పుట్కోజు చంద్రమౌళి బృందంచే అన్నమయ్య సంకీర్తనాలహరి, ఇతర భక్తిపాటల కార్యక్రమం ఉంటుంది. కార్యక్రమంలో దేవస్థానం పాలక మండలి సభ్యులు శ్రవణ్‌కుమార్, సూపరింటెండెంట్ నిత్యానందాచారి, జిల్లా కళాకారుల సంస్థ కోశాధికారి ఎండీ సలీం, శ్రీమిత్ర కళానాట్య మండలి ఉపాధ్యక్షుడు నర్సింహులు, కళాకారులు కాశన్న పాల్గొన్నారు.

నిరుద్యోగులకు విదేశీ ప్లేస్‌మెంట్ అవకాశాలు
జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలోని నిరుద్యోగ యువతకు విదేశాల్లో సెమీ స్కిల్డ్ కార్మికులుగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి మైత్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గల్ఫ్ దేశాలతోపాటు ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, హంగేరీ, పోలాండ్ దేశాల్లో టోటో మేటిష్, టెక్నీషియన్లు, ఎలక్ట్రీషియన్లు, బస్ డ్రైవర్లు తదితర రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అభ్యర్థులకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మంగళవారం మహబూబ్‌నగర్ రూరల్ మండలం ధర్మాపూర్ శివారులోని జేపీఎన్‌సీఈలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ ఉంటుందన్నారు.

భూముల విలువలు పెరిగిపోవడంతో ఎక్కువ ధరకు భూమి కొనుగోలు చేసిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి పక్కనున్న సామాన్య రైతు భూమిలోకి వచ్చి రాళ్లు పాతారు. ఎందుకని అడిగితే బెదిరించారు. మా భూమి ఇక్కడి వరకు ఉందని దబాయించారు. గ్రామపెద్దల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదు. ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో సర్వేకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే భూమిలోకి వచ్చి రాళ్లు పాతిన వారు సర్వేకు సహకరిస్తలేరని, నోటీసులు తీసుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధిత రైతు వాపోయారు.

హన్వాడ మండలం పెద్దదర్పల్లికి చెందిన చెన్నయ్యకు పట్టాదారు పాస్ పుస్తకం ప్రకారం సర్వే నం.83లో వారి పెద్దలు విక్రయించగా మిగతా 0.7 గుంటల పట్టా భూమి ఉంది. ఈ సర్వే నంబర్‌లో 18 ఎకరాల విస్తీర్ణం ఉండగా అందులో దాదాపు 15 మంది పట్టాదారులు ఉన్నారు. అయితే చెన్నయ్య భూమి 0.7 గుంటలు ఎక్కడ ఉందో చెప్పలేని పరిస్థితి. అంతలోనే పక్క భూమి వారు కోర్టులో కేసు వేయడంతో సర్వే అధికారులు సైతం కొలవడానికి రావడం లేదు. ఇలా ఎన్నో ఫిర్యాదులు ప్రతి సోమవారం కలెక్టరేట్, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిర్వహించే ప్రజావాణిలో వస్తున్నాయి.





సబ్‌డివిజన్ సమస్యకు.. పరిష్కారమేల?!

టీపన్ మ్యాపుల సమస్య
సబ్‌డివిజన్‌కు సంబంధించిన టీపన్ మ్యాపులు సర్వే ల్యాండ్ రికార్డ్స్‌లో అందుబాటులో లేకపోవడంతో సమస్య ఉత్పన్నమవుతోంది. వచ్చే దరఖాస్తుల్లో అగ్రభాగం సర్వే నంబర్ సబ్‌డివిజన్‌లోని విస్తీర్ణం కొలిచివ్వాలని ఉంటున్నాయి. సర్వే కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి వాస్తవ పరిష్కారం చూపించలేక సర్వేయర్లు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ పక్కాగా కొలతలు చూడాలంటే సర్వే నంబర్‌లో **ఎంతమంది పట్టాదారులున్నా అందరికీ నోటీసులిచ్చి సబ్‌డివిజన్ వారిగా చేసేందుకు అందరూ అంగీకరించాల్సి ఉంటుంది. కానీ, ఆక్రమితదారులు ఉద్దేశపూర్వకంగా కొలతలకు అంగీకరించకపోవడంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు.**

- సర్వే సమస్యలతో విసిగిపోతున్న రైతులు
- ప్రజావాణిలో అధిక శాతం ఫిర్యాదులన్నీ వాటిపైనే..
- కంటితుడుపు చర్యగానే ఎఫ్–లైన్ పిటిషన్లు
- మ్యాపులు లేవంటూ చేతులెత్తేస్తున్న అధికారులు
- పూర్తిస్థాయిలో భూముల రీ సర్వే చేస్తేనే మేలు

మొత్తం భూమి విస్తీర్ణం	6,49,974 ఎకరాలు
సర్వే నంబర్లు	6,91,529
రైతు ఖాతాలు	2,19,165

మహబూబ్‌నగర్ న్యూటౌన్: రెవెన్యూ శాఖలో భూ సమస్యలు కొలిక్కి రావడం లేదు. భూ రికార్డుల ప్రక్షాళన, కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాల జారీ, ధరణి పోర్టల్, తహసీల్దార్ కార్యాలయాల్లోనే భూముల రిజిస్ట్రేషన్లు, వెంటనే మ్యుటేషన్లు, వీఆర్వో, వీఆర్‌ఏ వ్యవస్థల రద్దుతోపాటు అనేక సంస్కరణలు చేపట్టిన ప్రభుత్వం క్షేత్రస్థాయిలో భూ సమస్యలకు చెక్ పెట్టలేకపోయింది. హద్దుల గొడవలు, సర్వే నంబర్ల సమస్యలతో రైతులు సతమతమవుతూనే ఉన్నారు. భూమి కొలతలకు సర్వే నంబర్ సబ్ డివిజన్ సమస్య భూ యజమానులకు తలనొప్పిగా మారింది. భూ సమస్యల పరిష్కారం సర్వేతో ముడిపడి ఉండటం, వ్యవస్థలో లోపాల కారణంగా సర్వే దరఖాస్తులకు వాస్తవ పరిష్కారం లభించక భూ యజమానులు తలలు పట్టుకుంటున్నారు. ప్రతి సోమవారం కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణిలో అధిక సంఖ్యలో దరఖాస్తులు భూ సమస్యలపైనే ఉండటం గమనార్హం. వాస్తవ పరిష్కారం లభించకపోవడంతో దరఖాస్తుదారులు మళ్లీ మళ్లీ దరఖాస్తు చేసుకోవడంతో కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. అయితే తాజాగా తెస్తున్న ఆర్‌ఓఆర్– 2024 చట్టంలోనూ సర్వేకు సంబంధించిన సమస్యల పరిష్కారం లేకపోవడంతో మళ్లీ అవే సమస్యలు పునరావృతమవుతాయని రెవెన్యూ వర్గాలు భావిస్తున్నాయి.

మూడు స్థాయిల్లో దరఖాస్తులు
భూముల కొలతలకు సంబంధించి మూడు స్థాయిల్లో దరఖాస్తులు చేసే అవకాశం ఉంది. మండల, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే, ఏడీ సర్వేలకు మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే దరఖాస్తు చేసుకున్న అనంతరం సదరు సర్వే నంబర్‌కు చుట్టూ ఉన్న సర్వే నంబర్లలోని భూ యజమానులకు నోటీసులు జారీ చేసి నిర్ణయించిన తేదీలో సర్వే కోసం క్షేత్రస్థాయికి వెళ్తారు. ఈ ప్రక్రియ దరఖాస్తుదారులకు న్యాయం చేయడం లేదు. దరఖాస్తుదారుడు సర్వే నంబర్‌లోని సబ్ డివిజన్‌లో కొలతలకు దరఖాస్తు చేయడం, సబ్‌డివిజన్ మ్యాపులు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో కొలతలు సాధ్యపడటం లేదు. ఒకవేళ నోటీసులు జారీ చేసినా ఇరువురు రాజీతో కొలతలు కొలిచేందుకు అవకాశమిస్తేనే పరిష్కారం లభిస్తోంది. దరఖాస్తుదారుడికి ఆక్రమితదారు కొలతలు కొలిచేందుకు అనుమతి ఇవ్వకపోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఫలితంగా సర్వే కోసం చేసిన ఎఫ్–లైన్ దరఖాస్తులు పెరుగుతూనే ఉన్నాయి.

మ్యాపులు లేవు..
సబ్‌డివిజన్ మ్యాపులు లేని కారణంగా కొలతలు సాధ్యపడటం లేదు. మాకు వచ్చే దరఖాస్తుల్లో అత్యధికంగా సర్వే నంబర్‌లోని సబ్ డివిజన్ పరిధి విస్తీర్ణాల కొలతల కోసమే వస్తున్నాయి. ఒకవేళ సర్వే నంబర్‌లోని పట్టాదారులందరి అంగీకారంతో ఎవరి విస్తీర్ణాన్ని వారికి కొలిచి ఇచ్చే అవకాశం ఉంటుంది. కానీ, సర్వే నంబర్‌లో ఆక్రమితదారులు కావాలని అభ్యంతరం చెప్పడంతో దరఖాస్తుదారుకు న్యాయం జరగడం లేదు. – కిషన్‌రావు, సర్వే ల్యాండ్ ఏడీ



పెండింగ్ ఫిర్యాదులు పరిష్కరించాలి



బాధితులతో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ పెండింగ్‌లో ఉన్న అర్జీలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి 76 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారులకు విన్నవిస్తూ అర్జీలు అందించారు. అనంతరం జిల్లా అధికారుల సమన్వయ సమావేశంలో కలెక్టర్ పలు అంశాలపై సూచనలు చేశారు. మండలంలో ఎంపిక చేసిన గ్రామంలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ఎంపీడీఓ లాగిన్ నుంచి కలెక్టర్‌కు పంపించాలని, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆమోదంతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి గ్రౌండింగ్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు మండల ప్రత్యేకాధికారులు తనిఖీలు నిర్వహించి పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం నాణ్యత పరిశీలించాలని చెప్పారు. కలెక్టరేట్‌లోని అన్ని కార్యాలయాల ఉద్యోగులు బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చెప్పారు. అనుమతి లేకుండా గైర్హాజరైన వారిపై, ఆలస్యంగా వచ్చినా హాజరును సమీక్షించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు పాల్గొన్నారు.

నేటి నుంచి నక్ష సర్వే ప్రారంభం



డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాట్లపై చర్చిస్తున్న ఆర్డీఓ, కమిషనర్, తహసీల్దార్

- జడ్చర్ల మున్సిపాలిటీలో లాంఛనంగా ప్రారంభించనున్న కలెక్టర్
- ఏర్పాట్లు పరిశీలించిన ఆర్డీఓ, కమిషనర్, తహసీల్దార్

జడ్చర్ల టౌన్: జడ్చర్ల మున్సిపాలిటీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన నక్ష (నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్) పైలెట్ ప్రాజెక్ట్ సర్వేను కలెక్టర్ విజయేందిర మంగళవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఇందుకోసం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో చేస్తున్న ఏర్పాట్లను సోమవారం ఆర్డీఓ అనిల్, మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, తహసీల్దార్ నర్సింగ్‌రావు పరిశీలించారు. నక్ష పైలెట్ ప్రాజెక్టును సర్వే ఆఫ్ ఇండియా, పురపాలిక, రెవెన్యూ, మున్సిపాలిటీలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. రాష్ట్రంలో పది మున్సిపాలిటీలు సర్వేకు ఎంపిక కాగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జడ్చర్ల మున్సిపాలిటి ఒక్కటే కావటం విశేషం. డిగ్రీ కళాశాల మైదానంలో సర్వే ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగానే అధికారులతోపాటు సర్వే సిబ్బంది రానున్నారు. మున్సిపాలిటీలోని గృహాలు, ఆస్తులు అన్నింటిని సర్వేలో లెక్కించనున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నక్ష సర్వేను కలెక్టర్ విజయేందిర లాంఛనంగా ప్రారంభిస్తారని వెల్లడించారు. సర్వే కోసం ఇప్పటికే సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. ప్రారంభ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ పాల్గొంటారని పేర్కొన్నారు.

చక్కర్లు కొట్టిన హెలీకాప్టర్
జడ్చర్ల మున్సిపాలిటీ మీదుగా మూడురోజులలో పలుమార్లు హెలీకాప్టర్ చక్కర్లు కొట్టింది. అయితే హెలీకాప్టర్ ఎందుకు చక్కర్లు కొట్టిందో పట్టణవాసులకు అర్థం కాలేదు. నక్ష సర్వే కోసమే హెలీకాప్టర్ చక్కర్లు కొట్టిందని అధికారులు వెల్లడించారు. మున్సిపాలిటీకి సంబంధించి పరిధులను హెలీకాప్టర్ ద్వారా సర్వే బృందం నిర్ణయించినట్లు చెప్పారు. మంగళవారం రోవర్ సహాయంతో సర్వే ప్రారంభించనున్నారు.

తెలంగాణలో అధికారంలోకి వస్తాం



భాస్కర్‌గౌడ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ డీకే అరుణ

అడ్డాకుల: తెలంగాణ ఏర్పడిన తర్వాత రెండుసార్లు బీఆర్‌ఎస్, ఒకసారి కాంగ్రెస్‌కు ప్రజలు అధికారం కట్టబెడితే రెండు పార్టీలు పాలనలో పూర్తిగా విఫలమైనందున.. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఎంపీ డీకే అరుణ అన్నారు. మూసాపేటలో మాజీ సర్పంచ్ భాస్కర్‌గౌడ్ నివాసం వద్ద సోమవారం బీఆర్‌ఎస్‌కు చెందిన రైతుబంధు సమితి మాజీ మండల అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, మూసాపేట, సంకలమద్ది, బంగ్లగడ్డ, తుంకినీపూర్ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు బీజేపీలో చేరగా వారికి ఎంపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనపై విసుగు చెంది కాంగ్రెస్‌కు ఓట్లేస్తే వారు కూడా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. రెండు పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీజేపీని గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రంలో కూడా అధికారంలోకి వస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. బీజేపీని స్థానికంగా బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేందుకు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని చైర్మన్ నరేందర్ ఆధ్వర్యంలో ఎంపీకి వినతిపత్రం అందజేశారు. జెడ్పీ హైస్కూల్‌కు మౌలిక వసతులు కల్పించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంపీని కోరారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ పవన్ కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రశాంత్‌రెడ్డి, నాయకులు భరత్‌భూషన్, నర్సింహ, జయన్నగౌడ్, అరవింద్ రెడ్డి, కొండారెడ్డి, జలేందర్‌రెడ్డి, తిరుపతయ్య, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు న్యాయ సహాయం అందిస్తాం



వంట గదిని పరిశీలిస్తున్న న్యాయమూర్తి ఇందిర

పాలమూరు: జైలులో శిక్ష అనుభవిస్తూ న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని పరిస్థితిలో ఉన్న ఖైదీలకు బెయిల్ కోసం లీగల్ ఎయిడ్ న్యాయవాది కావాలంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నుంచి న్యాయ సహాయం పొందవచ్చునని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఇందిర అన్నారు. జిల్లాకేంద్రంలోని జిల్లా జైలును సోమవారం న్యాయమూర్తి సందర్శించారు. మొదట జైలులో కిచెన్ గదులను పరిశీలించి ఆ తర్వాత ఖైదీలు ఉండే బ్యారక్‌ల దగ్గరకు వెళ్లి నేరుగా ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు కావాల్సిన న్యాయ సహాయంపై సూచనలు, సలహాలు అందించారు. అలాగే స్థానికంగా వసతులు, సదుపాయాలపై అధికారులతో చర్చించి ఆరా తీశారు. ఆమె వెంట జైలు సూపరింటెండెంట్ వెంకటేశం, జైలర్, సిబ్బంది ఉన్నారు.

కార్చిచ్చు ముప్పు..

- అగ్నిప్రమాదాల నివారణకు అటవీశాఖ ముందస్తు చర్యలు
- క్విక్ రెస్పాన్స్ బృందాల ఏర్పాటు
- వీవ్‌లైన్స్, ఫైర్‌లైన్స్‌తో మంటల అదుపు
- అటవీ సమీప గ్రామాల్లో అవగాహన సదస్సులు
- నల్లమలలో విలువైన ఔషధ మొక్కలు, వన్యప్రాణులు



హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిలో వీవ్‌లైన్స్ ద్వారా మంటలను ఆర్పివేస్తున్న సిబ్బంది (ఫైల్)

అచ్చంపేట: వేసవి నేపథ్యంలో నల్లమలలోని వన్యప్రాణులతోపాటు విలువైన అటవీ సంపదకు కార్చిచ్చు ముప్పు పొంచి ఉంది. ప్రస్తుతం అడవుల్లో చెట్ల ఆకులు రాలే సీజన్. చెట్ల నుంచి కింద పడిన ఆకులు ఎండిపోవడంతోపాటు కుప్పలుగా కనిపిస్తుంటాయి. ఈ పరిస్థితుల్లో వాటిపై నిప్పు పడితే కార్చిచ్చు వ్యాపించే ప్రమాదం ఉంటుంది. తద్వారా అటవీ సంపదతోపాటు వన్యప్రాణులకూ ముప్పు వాటిల్లుతోంది. అయితే జాగ్రత్తలు తీసుకుంటేనే ఈ విపత్తును నివారించవచ్చని భావిస్తున్న అటవీశాఖ అధికారులు.. జిల్లాలోని అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. అడవి బుగ్గిపాలు కాకుండా కాపాడుకునేందుకు ముందస్తుగా హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారికి ఇరువైపులా వీవ్‌లైన్స్, ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం అటవీశాఖ సిబ్బందితో అడవిలో ఎండిన ఆకులను వరుసగా పేర్చి కాల్చివేస్తున్నారు. ఒకవేళ అగ్గి రాజుకున్నా శరవేగంగా విస్తరించకుండా ఈ ఫైర్ లైన్స్‌తో అడ్డుకట్ట వేసే అవకాశం ఉంది.

నల్లటి రంగుతో సరిహద్దు
వేసవిలో చెట్ల ఆకులు రాలడం వల్ల చిన్నపాటి నిప్పురవ్వ పడినా అడవి దావనంలా వ్యాపిస్తోంది. ఈ నేపథ్యంలో అటవీశాఖ సిబ్బంది నేలపై రాలిన చెట్ల ఆకులను ఒకచోట పోగు చేసి.. కిలోమీటర్ పొడవునా కాల్చుతున్నారు. తద్వారా నిప్పు అంటుకున్నా మంటలు విస్తరించవు. మరోవైపు నల్లటి రంగుతో సరిహద్దు గీత ఏర్పడి వన్యప్రాణులు సైతం అడవి దాటి బయటకు వెళ్లకుండా ఫైర్‌లైన్స్ ఉపయోగపడతాయి.

విలువైన చెట్లు.. ఔషధ మొక్కలు
దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వ్‌గా నల్లమల అమ్రాబాద్ అభయారణ్యం గుర్తింపు పొందింది. ఇక్కడ ఔషధ మొక్కలతోపాటు టేకు, నల్లమద్ది, వేప, చేదు వేప, ఇప్ప తదితర చెట్లు అధికంగా ఉన్నాయి. వేసవి ప్రారంభంలోనే ఆకులు రాలి ఎండిపోయాయి. వాహనాల్లో వెళ్తున్న వారు సిగరెట్, బీడీలు తాగి.. పూర్తిగా ఆర్పకుండానే రోడ్డు పక్కనున్న అడవుల్లోకి విసురుతుంటారు. మరోవైపు పశువుల కాపరులు, అడవుల్లోకి ప్రవేశించే ఇతర వ్యక్తులు సైతం చుట్ట, బీడీ, సిగరెట్లు కాల్చిన అగ్గిపుల్లలను నిర్లక్ష్యంగా పడేస్తుంటారు. తద్వారా మంటలు వ్యాపించే ప్రమాదం ఉంటుంది.

శాటిలైట్ సహాయంతో..
నల్లమల అటవీ ప్రాంతంలో అగ్గి అంటుకున్న వెంటనే ఆర్పేందుకు వీలుగా అటవీశాఖ అధికారులు తక్షణ స్పందన (క్విక్ రెస్పాన్స్) బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. ఠయింభవళ్లు ఎక్కడ అగ్గి రాజుకున్నా శాటిలైట్ సహాయంతో ప్రమాదాన్ని గుర్తించి.. మంటలను ఆర్పివేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. మరోవైపు అటవీ సమీప గ్రామాల్లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.


నల్లమల అటవీ ప్రాంతం ఇలా..	అటవీ విస్తీర్ణం	అమ్రాబాద్ టైగర్ రిజర్వు పరిధి	బఫర్ జోన్ (ఏటీఆర్)	మొత్తం ఫారెస్టు బ్లాకులు
	2,611.39 చ.కి.మీ.,	2,166.37 చ.కి.మీ.,	445.02 చ.కి.మీ.,	25

నిరంతర గస్తీ..



అటవీ పరిరక్షణకు గస్తీ ముమ్మరం చేశాం. క్షేత్రస్థాయిలో అటవీశాఖ సిబ్బంది నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాం. ఆకతాయిలు, పశువుల కాపరులు, ఇతరులు అడవుల్లోకి అగ్గిపెట్టెలు తీసుకుపోకుండా అవగాహన కల్పిస్తున్నాం. రోడ్డు వెంట వెళ్లే వారు నిప్పు వేసినా అడవి కాలకుండా ఇరువైపులా 20 – 30 మీటర్ల వరకు గడ్డి, ఆకులను ముందుగానే కాల్చివేస్తున్నాం.
– గురుప్రసాద్, ఎఫ్‌ఆర్‌ఓ, దోమలపెంట

కఠిన చర్యలు..



ఎవరైనా అడవిలో నిప్పు పెట్టినట్లు తేలితే అటవీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. అడవులు అగ్నిప్రమాదాల బారిన పడకుండా ముందస్తు కార్యాచరణ చేపట్టాం. వీవ్‌లైన్స్, ఫైర్‌లైన్స్ ఏర్పాటుతో ఒకచోట నుంచి మరో చోటకు మంటలు వ్యాపించకుండా చర్యలు చేపడుతున్నాం.
– రోహిత్‌రెడ్డి, డీఎఫ్‌ఓ.

క్లుప్తంగా

కేజీబీవీ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

చిన్నంబావి: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) పదో తరగతి విద్యార్థి మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సిబ్బంది తెలిపిన వివరాలు.. వనపర్తి జిల్లాలోని ఖిల్లాఘనపూర్ మండలంలోని రుక్కన్నలపల్లితండాకు చెందిన శ్రీలత(15) కేజీబీవీలో పదో తరగతి చదువుతుంది. సోమవారం ప్రతిజ్ఞ కార్యక్రమానికి హాజరుకాక పోవడాన్ని సిబ్బంది గమనించారు. క్లాస్‌రూంలోకి వెళ్లి చూడగా బాలిక చేతిలో జ్వర మాత్రల స్లిప్ ఉంది. వెంటనే ఇన్‌చార్జి ఎస్‌ఓ ప్రశాంతికి సమాచారం అందించారు. హుటాహుటిన వీపనగండ్లలోని ప్రభుత్వాస్పత్రికి అక్కడి నుంచి వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమయానికి ఆస్పత్రికి తరలించడంతో విద్యార్థిని పరిస్థితి మెరుగుపడిందని సిబ్బంది తెలిపారు. అసలు బాలికకు అన్ని మాత్రలు ఎలా వచ్చాయని, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని పలువురు విద్యార్థుల బంధువులు ఆరోపిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


పెద్ద పర్వతాలు (ఫైల్)

తెలకపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని మదనాపురం గేట్ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని రాకొండకు చెందిన పొట్టే పెద్ద పర్వతాలు (60) ద్విచక్ర వాహనంపై పెద్దూరు నుంచి తెలకపల్లికి వస్తుండగా.. మదనాపురం గేట్ సమీపంలో ఎదురుగా వస్తున్న మినీ డీసీఎం ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రగాయాలైన అతడిని స్థానికులు 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని మరొకరు..


కుర్వ ఈరన్న (ఫైల్)

మల్దకల్: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం శేషంపల్లి సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నందికర్ కథనం మేరకు.. మద్దెలబండకు చెందిన కుర్వ ఈరన్న (38) వ్యవసాయ పనుల నిమిత్తం అయిజకు వెళ్లి తిరిగి వస్తున్నారు. అదే సమయంలో అమరవాయికి చెందిన ఎరుకలి నర్సింహులు తన బైక్‌పై తాటికుంటకు వెళ్తుండగా మార్గమధ్యం శేషంపల్లి సమీపంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఈరన్న అక్కడికక్కడే మృతిచెందగా, నర్సింహులుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే చికిత్స నిమిత్తం గద్వాల ఆస్పత్రికి అటు నుంచి కర్నూలు ఆస్పత్రికి తరలించారు. ఈరన్నకు భార్య సవారమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారని.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఆరు తులాల బంగారం చోరీ

అయిజ: పట్టపగలు ఆరు తులాల బంగారం చోరీకి గురైన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం.. మేడికొండ గ్రామానికి చెందిన వీరేష్ మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో తనఖా పెట్టిన 6 తులాల బంగారాన్ని సోమవారం వెనక్కి తీసుకొని ఒక కవర్‌లో ఉంచి తన మోటార్ సైకిల్‌లోని ట్యాంక్ కవర్‌లో పెట్టాడు. అనంతరం ఫర్టిలైజర్‌కు సంబంధించిన అప్పు చెల్లించేందుకు షాపుకు ముందు బైక్ పెట్టి లోపలికి వెళ్లాడు. తిరిగి వచ్చి చూస్తే బంగారం కనపడలేదు. ఈవిషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎట్టకేలకు దొరికాడు

- నకిలీ సర్టిఫికెట్‌తో ఏఈఓ ఉద్యోగం
- ఐదేళ్లు గద్వాల వ్యవసాయ శాఖలో విధులు
- అర్హత సర్టిఫికెట్ల పరిశీలనలో విషయం వెలుగులోకి..
- గతేడాది చీటింగ్ కేసు నమోదు.. నాటి నుంచి అజ్ఞాతంలోనే ఏఈఓ
- తాజాగా నాగర్‌కర్నూల్ జిల్లాలో అదుపులోకి తీసుకున్న పోలీసులు



పోలీసుల అదుపులో ముఠా సభ్యులు

నకిలీ సర్టిఫికెట్ల తయారీలో మిర్యాలగూడకు చెందిన పలువురు సభ్యులు ముఠాగా ఏర్పడి ఈ దందా నడిపిస్తున్నట్లు పోలీసులు గుర్తించి వారిని సైతం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో లేని విశ్వవిద్యాలయాల పేర్లతో నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి వేలాది మందికి డిప్లొమా సర్టిఫికెట్లు అందించినట్లు తెలుస్తోంది. తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాలకు సైతం ఈ ముఠా సభ్యులు నకిలీ సర్టిఫికెట్లు అందజేసి ఉండవచ్చనే అనుమానం మేరకు పోలీసులు విచారిస్తున్నారు. అయితే ఈ ముఠా అసలు సూత్రధారులు ఎవరు అనే కోణంలోనూ ఆరా తీస్తున్నారు.

గద్వాలలో కలకలం..

నకిలీ సర్టిఫికెట్లతో ఏఈఓగా ఉద్యోగం పొందడమేగాక.. ఏకంగా ఐదేళ్ల విధులు నిర్వహించాడనే వార్త జిల్లాలో కలకలం రేపింది. ఇన్నేళ్లు పనిచేసినా ఉన్నతాధికారులు గుర్తించడంలో విఫలమయ్యారా.. లేక తెలిసే మనకెందుకులే అనే తరహాలో వ్యవహరించారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు అన్ని కోణాల్లో విచారిస్తేనే ఉన్నతాధికారుల ముసుగులో ఉన్న దోషులు బయటపడతారు. దీనికి తోడు గద్వాల వ్యవసాయ శాఖ అధికారులపైనా పలువురు ఆరోపణలు గుప్పిస్తున్నారు. గతేడాది రైతుబంధు డబ్బులు పెద్దఎత్తున లేని రైతుల పేర్లతో నగదు కాజేసినట్లు బహిర్గతం కావడం ఆరోపణలకు బలాన్ని చేకూర్చుతోంది. తాజాగా నకిలీ ధ్రువపత్రాల వ్యవహారం వెలుగులోకి రావడంతో వ్యవసాయ శాఖ అధికారులు అయోమయంలో పడ్డారు. ఈ విషయాలపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని సంప్రదించేందుకు 'సాక్షి' ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

గద్వాల క్రైం: నకిలీ డిప్లొమా సర్టిఫికెట్‌తో ఏఈఓ ఉద్యోగం పొందడంతోపాటు.. ఈ విషయం వెలుగులోకి వచ్చిన వెంటనే అజ్ఞాతంలోకి వెళ్లిన వ్యక్తిని ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన ఓ వ్యక్తి 2012- 2015 వరకు ఉత్తరప్రదేశ్ గాజీపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అగ్రికల్చర్ ఇంజినీరింగ్ డిప్లొమా చదివినట్లు నకిలీ సర్టిఫికెట్ పొందాడు. 2017లో ప్రభుత్వ వ్యవసాయ శాఖలో ఏఈఓ (అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ వ్యవసాయ అధికారి)గా ఉద్యోగం సాధించాడు. అనంతరం 2017 నుంచి 2023 వరకు జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలో ఏఈఓగా ఐదేళ్లపాటు విధులు నిర్వహించాడు.

వెలుగులోకి వచ్చిందిలా..

ప్రభుత్వం ఆయా ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు సంబంధించిన అర్హత సర్టిఫికెట్లు, విశ్వవిద్యాలయ గుర్తింపును పునఃపరిశీలన చేపట్టింది. ఈ మేరకు ఇంటెలిజెన్స్ విభాగం పలువురు ఉద్యోగుల అర్హత, ఎక్కడ చదివారు అనే విషయాలపై కూపీ లాగారు. ఈ క్రమంలో సదరు వ్యక్తి నకిలీ సర్టిఫికెట్లతో వ్యవసాయ శాఖలో ఉద్యోగం పొందినట్లు గుర్తించి రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులకు నివేదిక అందజేశారు. దీంతో సంబంధిత అధికారులు మల్దకల్ మండలం క్లస్టర్‌గా అచ్చంపేటకు చెందిన వ్యక్తి నకిలీ సర్టిఫికెట్లతో కొలువు పొందినట్లు నివేదిక ఆధారంగా 2024 మార్చిలో సదరు వ్యక్తిపై 417, 420, 465, 468, 471 సెక్షన్ల కింద పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న సదరు వ్యక్తి అప్పటి నుంచి అజ్ఞాతంలోకి వెళ్లాడు. ఎట్టకేలకు నమ్మదగిన సమాచారం మేరకు నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉన్నట్లు గుర్తించి సోమవారం గద్వాల పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తాం



నకిలీ సర్టిఫికెట్లతో ఓ వ్యక్తి గద్వాల జిల్లా వ్యవసాయ శాఖలో ఉద్యోగం పొందినట్లు గతేడాది రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించాం. అయితే, నాటి నుంచి సదరు వ్యక్తి అజ్ఞాతంలో ఉన్నాడు. తాజాగా నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉన్నట్లు సమాచారం అందడంతో సోమవారం అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకున్నాం. ప్రస్తుతం కేసు విచారణ దశలో ఉంది. ఈ నకిలీ సర్టిఫికెట్ల తయారీ ముఠాలో ఎంతమంది ఉన్నారు అనే కోణంలోనూ ఆరా తీస్తున్నాం. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తాం.

– శ్రీను సీఐ, గద్వాల

బావిలో పడి తండ్రీకొడుకులు మృతి


శివయ్య, కౌషిక్ (ఫైల్)

నారాయణపేట: దాహం వేసిందని బావిలో నీరు తాగేందుకు వెళ్లిన తండ్రీకొడుకులు ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందారు. ఈ విషాదకర సంఘటన నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలంలోని మద్దెల్‌బీడులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటకలోని మినాస్‌పూర్‌కు చెందిన శివయ్య(35) తన కుమారుడు కౌషిక్(5)తో కలిసి వారం రోజుల క్రితం తన అత్త చంద్రమ్మను పలకరించేందుకు మద్దెల్‌బీడుకు వచ్చారు. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో అత్త పొలం దగ్గరకు కొడుకుతో కలిసి వెళ్లారు. అయితే ఆయనకు మద్యం తాగే అలవాటు ఉండడంతో తాగిన మైకంలో బావి దగ్గరకు కుమారుడితో కలిసి దాహం తీర్చుకునేందుకు వెళ్లారు. కాలు జారి బావిలో తండ్రీకొడుకులు ఇద్దరూ పడ్డారు. శివయ్యకు ఈత రాకపోవడంతో మృతిచెందారు. చుట్టు పక్కల ఉన్న పొలాల్లోని రైతులు గమనించి వారిని బయటికి తీశారు. అప్పటికే మృతిచెందడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ప్రత్యేక వాహనంలో వారిని కర్ణాటకలోని మినాస్‌పూర్‌కు తరలించారు. ఈ ఘటనతో ఇటు మద్దెల్‌బీడు, అటు మినాస్‌పూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. శివయ్యకు భార్యతోపాటు ఓ కుమార్తె ఉన్నారు.

ఆవేశంలో బైక్‌ను తగలబెట్టిన వ్యక్తి


మంటల్లో తగలబడుతున్న బైక్

తెలకపల్లి: ఆవేశంలో ఓవ్యక్తి తన బైక్‌ను తానే తగలబెట్టిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని గోలగుండంకి చెందిన చందు సోమవారం మధ్యాహ్నం తెలకపల్లిలోని బ్యాంక్ ఆఫ్ బరోడా ముందు తన బైక్‌కు నిప్పంటించాడు. తన తల్లి నిరంజనమ్మ పేరుమీద ఉన్న రూ.1.29లక్షల రుణం మాఫీ అయింది. ఇంకా రూ.13వేలు బ్యాంక్‌లో అప్పు ఉంది. అవి చెల్లిస్తే కొత్తరుణాలు కానీ, పాస్‌బుక్కులు ఇస్తామని బ్యాంక్ అధికారులు తెలిపారు. మళ్లీ రుణం కావాలని బ్యాంక్‌కు వచ్చినా ఇవ్వడం లేదంటూ ఆవేదన చెందాడు. ఈ నేపథ్యంలో సోమవారం బ్యాంక్‌లోకి వెళ్లి అధికారులను పలకరించి చందు బ్యాంక్ నుంచి బయటకొచ్చాడు. బ్యాంక్ బయటే బైక్‌కు పెట్రోల్‌పోసి నిప్పంటించాడు. మంటలు చెలరేగడంతో ఎవరూ దగ్గరకు వెళ్లే సాహసం చేయలేదు. బ్యాంక్ అధికారులే మంటను ఆర్పినట్లు స్థానికులు తెలిపారు. ఇతని మానసిక స్థితి సరిగా లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. పోలీసులు చందును అదుపులోకి తీసుకున్నారు. ఈఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

దుకాణానికి నిప్పు పెట్టేందుకు యత్నం

అయిజ: మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహ వస్త్ర దుకాణం పై అంతస్తులో ఉన్న గోదాంకు ఆదివారం ఒక మహిళ నిప్పు పెట్టేందుకు ప్రయత్నించిన వీడియో సీసీ కెమెరాలో బయటపడింది. పెట్రోల్‌లో ముంచిన పేపర్‌ను షట్టర్ కింది నుంచి లోపలికి వేసింది. గోదాంలో వస్తువులు లేకపోవడంతో ప్రమాదం జరుగలేదు. ఈ విషయం సోమవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ విషయంపై ఎస్‌ఐని వివరణ కోరగా.. ఘటనకు సంబంధించి పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగికి టోకరా

ఖాతా నుంచి రూ.90 వేలు మాయం చేసిన సైబర్ నేరగాళ్లు

మహబూబ్‌నగర్ క్రైం: పోలీసులం అంటూ ఓ గుర్తు తెలియని నంబర్ నుంచి ప్రభుత్వ ఉద్యోగికి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు.. నీపై కేసు నమోదైంది.. కొంత నగదు ఇస్తే కేసు తొలగిస్తాం అంటూ నమ్మించడంతో మోసపోయాడు. ఈ ఘటనకు సంబంధించి టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగికి ఇటీవల గుర్తుతెలియని ఫోన్ నంబర్ నుంచి ఫోన్ చేసి నీపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని, రూ.1 లక్ష ఇస్తే కేసు లేకుండా చేస్తామని నమ్మించడంతో దీంతో సదరు ఉద్యోగి వారు ఇచ్చిన ఫోన్ నంబర్‌కు రూ.90 వేలు పంపించాడు. తర్వాత తాను మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. మరో కేసులో ప్రైవేట్ ఉద్యోగం చేసుకునే వ్యక్తికి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు అతని నుంచి ఓటీపీ చెప్పించుకున్న తర్వాత ఖాతాలో నుంచి రూ.36 వేలు మాయం చేశారు. మరో కేసులో సైట్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఖాతాలో నుంచి అతనికి సమాచారం లేకుండానే రూ.25,500 నగదు మాయం చేశారు. ముగ్గురు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం


పీయూలో పీజీ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ చెన్నప్ప

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని తొమ్మిది పరీక్ష కేంద్రాల్లో సోమవారం పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. వీటితోపాటు మధ్యాహ్నం జరిగిన మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలలో 1,945 మందికి గాను 1,854 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా, పీయూలోని పీజీ పరీక్ష కేంద్రాన్ని వైస్ చాన్స్‌లర్ ఆచార్య జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ చెన్నప్పతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు సమష్టిగా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. క్యూఆర్ కోడ్ పై గల సబ్జెక్టు, కోడ్, వ్యక్తిగత వివరాలను సరిచూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి రాజకుమార్, చీఫ్ సూపరింటెండెంట్ మధుసూదన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, అకాడమిక్ కోఆర్డినేటర్ గౌస్‌మొయుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు కంటి పరీక్షలు


విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పాలమూరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అన్ని ప్రభుత్వ రెసిడెన్షియల్ (కేజీబీవీ, గురుకుల) పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపంతో బాధపడుతున్న వారిని గుర్తించే పనిలో పడ్డారు. ఈ మేరకు ప్రతి పాఠశాలలో పదేళ్ల నుంచి 19 ఏళ్ల వయసు కలిగిన బాల బాలికలకు కంటి స్క్రీనింగ్ నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. దీనిలో భాగంగా సోమవారం నుంచి జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని కంటి విభాగంలో విద్యార్థులకు వైద్యులు కంటి పరీక్షలు ప్రారంభించారు. మార్చి 2 నాటికి జిల్లాలోని 2,272 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు పూర్తి చేయాల్సి ఉంది. గతేడాది ఏప్రిల్, ఆగస్టులో విద్యార్థులకు స్క్రీనింగ్ చేసిన అద్దాలు పంపిణీ చేయలేదు. ఈ ఏడాది గతంలో స్క్రీనింగ్ పూర్తి చేసి గుర్తించిన విద్యార్థులు అందరికీ మళ్లీ స్క్రీనింగ్ చేసి అద్దాలు పంపిణీ చేయడంతోపాటు సర్జరీ అవసరమైన విద్యార్థులకు హైదరాబాద్‌లోని సరోజినిదేవి ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించనున్నారు. మొదటి రోజు జిల్లావ్యాప్తంగా 287 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో మహబూబ్‌నగర్ పరిధిలో 184 మంది విద్యార్థులకు పరీక్షలు చేయగా వారిలో 181 మందికి అద్దాలు అవసరం ఉన్నట్లు గుర్తించగా మరో ముగ్గురికి సర్జరీ అవసరం కావడంతో సరోజినిదేవి ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఇక జడ్చర్లలో 103 మందికి కంటి పరీక్షలు చేయగా 99 మందికి అద్దాలు, నలుగురికి సర్జరీకి రెఫర్ చేయడం జరిగింది.

■ దృష్టిలోపం ఉన్న విద్యార్థులు అందరికీ తప్పక కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు అందజేస్తామని డీఎంహెచ్‌ఓ కృష్ణ అన్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కంటి పరీక్షల స్క్రీనింగ్ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సకాలంలో గుర్తించిన లక్ష్యంతోపాటు కొత్త విద్యార్థులకు కంటి పరీక్షలు పూర్తి చేయాలన్నారు. దృష్టిలోప సమస్య తీవ్రతను బట్టి అద్దాలను ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే సర్జరీలు అవసరమైన విద్యార్థులకు హైదరాబాద్‌లో చేయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఐఓ పద్మజా, డిప్యూటీ సూపరింటెండెంట్ సునీల్, దేవిదాస్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

పీయూలో రిటైర్డ్ ఉద్యోగుల తొలగింపు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో కాన్సెల్టుగా తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న 14 మందికిపైగా రిటైర్డ్ ఉద్యోగులను అధికారులు తొలగించారు. మాజీ వీసీలు రాజారత్నం, లక్ష్మీకాంత్ రాథోడ్ హయాంలో రిటైర్డ్ అయిన పలువురిని సీనియార్టీ, సర్వీస్ నిమిత్తం నియమించారు. అయితే నియామక సమయంలో గత వీసీలకు అనుకూలంగా ఉన్న వారిని, తమకు కావాల్సిన వారిని అధిక వేతనాలు ఇచ్చి నియమించారన్న ఆరోపణలు ఉన్నాయి. వారిలో కొందరు అడ్మినిస్ట్రేషన్ విభాగం, పీజీ కళాశాల, పరీక్షల విభాగం, అకౌంట్స్ విభాగాల్లో ఉద్యోగులుగా, మరికొందరు సింథటిక్ ట్రాక్, ఇంజినీరింగ్ విభాగంలో కన్సల్టెంట్లుగా పనిచేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి ఒక్కొక్కరికి రూ.25 వేల నుంచి రూ.60 వేలకు పైగా వేతనాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. కొంతమంది వయోభారంతో ఇబ్బంది పడుతున్నా విధుల్లో కొనసాగించారు. అయితే ఇటీవల టీజీపీఎస్సీ ద్వారా ఏడుగురు ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులర్ ప్రాతిపదికన నియమించడంతో రిటైర్డ్ ఉద్యోగులను తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు.

■ ఈ విషయమై వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ స్పందిస్తూ.. ఇటీవల ప్రభుత్వం రెగ్యులర్ ప్రాతిపదికన ఏడుగురు జూనియర్ అసిస్టెంట్లను నియమించడంతో గతంలో తాత్కాలిక పద్ధతిలో నియామకమైన రిటైర్డ్ ఉద్యోగులను ప్రభుత్వ నిబంధనల మేరకు తొలగించామని చెప్పారు. 61 ఏళ్లు దాటిన వారిని మాత్రమే తొలగించామని పేర్కొన్నారు.

డాక్టర్ రామలక్ష్మణ్‌కు ఏషియన్ స్పోర్ట్స్ లీడర్‌షిప్ అవార్డు


అవార్డు సర్టిఫికెట్‌తో డాక్టర్ రామలక్ష్మణ్

మహబూబ్‌నగర్ క్రీడలు: ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిట్‌నెస్ స్పోర్ట్స్ సైన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కాన్ఫరెన్స్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన వ్యాయామ సంచాలకులు డాక్టర్ జె.రామలక్ష్మయ్య ఏషియన్ స్పోర్ట్స్ లీడర్ అవార్డు అందుకున్నారు. రామలక్ష్మయ్య మహేంద్రహిల్స్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ వ్యాయామ సంచాలకుడిగా పనిచేస్తున్నారు. ఈయన గతంలో పలు పురస్కారాలు అందుకున్నారు. 2016– 17లో నాగర్‌కర్నూల్ జిల్లా ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్‌గా, 2019లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్‌గా, 2024లో ఆరెంజ్ వరల్డ్ రికార్డు అవార్డు అందుకున్నారు. టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్‌లో 2017 నుంచి 2024 వరకు స్పోర్ట్స్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా రామలక్ష్మయ్య మాట్లాడుతూ ఈ ప్రతిష్టాత్మక అవార్డును టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ క్రీడా విభాగం, కోచ్‌లకు అంకితం చేస్తున్నానని తెలిపారు. వారి అంకితభావంతోనే అనేక మంది యువ క్రీడాకారులు ఉత్తమ ప్రదర్శన కనబరిచే అవకాశం పొందారన్నారు. అవార్డు ఇచ్చిన స్ఫూర్తితో భవిష్యత్‌లో మరింత మంది యువ క్రీడాకారులను ప్రోత్సహించి క్రీడా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానని పేర్కొన్నారు.

పిచ్చి కుక్కల స్వైరవిహారం

- 22 మందికి గాయాలు
- బాధితులకు జిల్లా ఆస్పత్రిలో చికిత్స


జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నర్సమ్మ


కోస్గి ఆస్పత్రిలో చిన్నారి


కుక్క దాడిలో గాయపడిన చిన్నారి

కోస్గి: మూడు రోజులుగా పట్టణంలోని పలు కాలనీల్లో పిచ్చి కుక్కలు సంచరిస్తూ దాడులు చేయడంతో పలువురు స్వల్ప గాయాలపాలయ్యారు. ఈ క్రమంలో ఆదివారం ఏకంగా రెండు పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తూ చిన్నాపెద్ద తేడా లేకుండా ఏకంగా 22 మందిపై దాడి చేసి గాయపరిచాయి. వీరిలో చిన్నారులు, మహిళలు సైతం ఉన్నారు. మున్సిపల్ కేంద్రంలో చోటు చేసుకున్న ఘటనలు.. శుక్ర, శనివారం ఎస్సీ కాలనీ, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియాల్లో పిచ్చి కుక్కలు ఉదయం నడక నుంచి వస్తున్న వారిపై దాడి చేయగా ఇద్దరికి కాళ్లకు గాయాలయ్యాయి. ఆదివారం ఉదయం పట్టణంలోని ఎస్సీ కాలనీ, మామిళ్ల వీధి, బహార్‌పేట, ఆడికే వీధి, రామాలయం చౌరస్తాతో పాటు పలు చోట్ల రెండు పిచ్చి కుక్కలు పలువురిని గాయపరిచాయి. కొందరు యువకులు ఓ పిచ్చి కుక్కను వెంబడించి కొట్టి చంపగా.. మరోటి పరారైంది. గాయపడిన వారు ఒక్కొక్కరుగా స్థానిక ప్రభుత్వాస్పత్రికి క్యూ కట్టారు. కాలుపై కాటుతో తీవ్రంగా గాయపడటంతో మామిళ్ల నర్సమ్మతో పాటు మరో ముగ్గురిని పాలమూర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో లింగంపల్లి కన్నప్ప, అనంతమ్మ, సాయమ్మ, నాగమణి, అనూశ్రీ, చెన్న బాలప్ప, శంకరమ్మ, లక్ష్మమ్మ, ఎల్లమ్మ, అభిజ్ఞ, హన్మంతు, వెంకటమ్మ, బిచ్చమ్మ, సాయిచరణ్, ఆంజనేయులుతో పాటు పలువురు ఉన్నారు. కుక్కల బెడదపై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుందని పలువురు పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కుక్కల నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గుళికలు కొంటేనే యూరియా!

ఫర్టిలైజర్ దుకాణాల నిర్వాహకుల తీరుతో రైతుల అవస్థలు



యూరియాకు గుళికలు అంటగడుతున్న ఎరువుల దుకాణం ఇదే..

మహమ్మదాబాద్: ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులకు అడుగడుగునా కష్టాలు ఎదురవుతున్నాయి. ఓవైపు పంటలకు అంతుచిక్కని తెగుళ్లతో పంటలను కాపాడుకోలేని దుస్థితి నెలకొనగా.. మరోవైపు ఫర్టిలైజర్ దుకాణాలకు వెళ్తే ఒకటి కొంటేనే మరొకటి ఇస్తామని మెలిక పెట్టడం రైతులకు భారంగా మారుతోంది. మహమ్మదాబాద్ మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాల నిర్వాహకుల తీరుతో రైతులకు అవస్థలు తప్పడం లేదు. రూ.500 పైగా విలువజేసే పిల్లగుళికలు కొంటేనే యూరియా ఇస్తామని షరతులు పెడుతున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. నంచర్లగేట్‌లోని ఎరువుల దుకాణానికి యూరియా కోసం వెళ్లిన ఓ రైతుకు ఈ పరిస్థితి ఎదురైంది. అయితే చేతిలో డబ్బు లేకపోవడంతో చేసేది లేక నిరాశతో వెనుదిరిగారు.

నాసిరకం గుళికలు..

మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో నాసిరకం గుళికలు విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో వరిపైరుకు ఎన్ని గుళికలు చల్లినా మందులు పిచికారీ చేసినా తెగుళ్లు తగ్గడం లేదని వాపోతున్నారు. ఈవిషయమై మండల వ్యవసాయాధికారి నరేందర్‌ను వివరణ కోరగా.. నిబంధనలకు విరుద్ధంగా ఎరువులను అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు.

చెప్పింది కొనమంటున్నారు..



వరిచేను కలుపుతీసి యూరియా వేసేందుకు నంచర్ల గేట్‌లోని శ్రీలక్ష్మీ నర్సింహ ఫర్టిలైజర్ దుకాణానికి వెళ్లాను. దుకాణ యజమాని పిల్లగుళికలు తీసుకుంటేనే యూరియా ఇస్తానని తెలిపాడు. యూరియాను కూడా రూ. 280కి విక్రయించాల్సి ఉండగా.. రూ.310 వసూలు చేస్తున్నారు. సంబంధిత అధికారులు తనిఖీలు చేయకపోవడంతో వ్యాపారులు ఇష్టానుసారంగా ఎరువులు అమ్ముకుంటున్నారు.

– శ్రీనివాస్, రైతు, కొండారెడ్డిపల్లి